ప్రజాశక్తి
బుధవారం 10 ఏప్రిల్ 2024
8 పేజీలు

కర్నూలు
నంద్యాల

వైభవంగా మల్లన్న రథోత్సవం

- రమావాణి సేవిత రాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవారు

ప్రజాశక్తి - శ్రీశైలం

ఉగాది పర్వదిన సందర్భంగా శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వాళ్లకు అంగరంగ వైభవంగా రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైభవంగా జరిగిన రథోత్సవంలో కోలాటం చెక్కభజన జానపద పగటివేషాల ప్రదర్శన బుట్ట బొమ్మలు, గొరవయ్య నృత్యం, తప్పెట మిగతా 3లో

రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం

ఘనంగా ఉగాది వేడుకలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ప్రజాశక్తి - బనగానపల్లె

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉగాది పర్వదిన వేడుకలను ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. బనగానపల్లె మండలంలో ప్రజలు ఉదయాన్నే కొత్త దుస్తులు ధరించి దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని పంచాంగానికి, దేవతలకు నైవేద్యం చేసి పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది సందర్భంగా ఆయా గ్రామాల్లోని పొలిమేరల్లో కొలువైన గ్రామదేవతలు మారెమ్మ, మిగతా 3లో

బనగానపల్లెలో ఉగాది సందర్భంగా అమ్మవారికి బోనాలతో వస్తున్న మహిళలు

ఎండియుల
నిలువు దోపిడీ

- నిత్యావసర సరుకుల పంపిణీలో చేతివాటం
- నెలకు రూ.లక్షల్లో ఆదాయం - చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - హోళగుంద

ప్రభుత్వం పేదలకు అందించే నిత్యావసర సరుకుల పంపిణీలో ఎండియు (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) నిర్వాహకులు నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. నిత్యావసర వస్తువుల పంపిణీలో చేతివాటం ప్రదర్శిస్తూ నెలకు రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. ఎండియు ఆపరేటర్ల అక్రమాలను అరికట్టే రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు మామూళ్ల మత్తులో పడి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు అందించాలనే ఉద్దేశంతో ఎండియు ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీకి శ్రీకారం చుట్టారు. హోళగుంద మండలంలో 17,204 తెల్ల రేషన్ కార్డుదారులు ఉన్నారు. 32 చౌక ధర దుకాణాలు ఉన్నాయి. నెలవారీగా 2,597 క్వింటాళ్ల బియ్యం, 17,156 కిలోల కందిపప్పు, 17,204 కిలోల రాగి పిండి, 77 క్వింటాళ్ల చక్కెర అందిస్తున్నారు. 32 రేషన్ షాపుల పరిధిలో పది వాహనాల ద్వారా కార్డుదారులకు సరుకులు అందిస్తున్నారు. ఎండియు ఆపరేటర్లు మాత్రం అందిన కాడికి బియ్యం ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే కార్డుదారుల నుండి అధిక ధరలు వసూలు చేసి సొమ్ము చేసుకుంటూ ఇంకెందుకు అని కార్డుదారులు ప్రశ్నిస్తే కార్డుదారులపై ఎదురుదాడికి దిగుతున్నారు.

ఎండియు నిర్వాహకుల చేతివాటం:

ఎండియు నిర్వాహకులు రేషన్ కార్డుదారులకు రేషన్ పంపిణీలో తూకంలో మోసం చేసి చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఉదాహరణకు ఎండియు ఆపరేటర్ బసవరాజు ఎండియు నంబర్ కెఎల్24002 చౌక ధరదుకాణం నెంబర్ 1324003 సంబంధించిన సరుకులు పంపిణీలో బహిరంగంగా ఒక కేజీ తూకం గల ఇనుప డబ్బాని పెట్టి కార్డుదారులను నిలువు దోపిడీకి గురి చేస్తున్న సంఘటన పాత్రికేయుల కంటపడింది. ఇదేమిటి అని ప్రశ్నించగా ఇది అంతే మీకు ఇష్ట వచ్చింది రాసుకోండి నేను ఇంతే ఎవరికైనా చెప్పుకోండి అని సమాధానం ఇవ్వడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. మండలంలో 17,204 కార్డుదారులకు అందించే రేషన్ పంపిణీలో ఒక్కో రేషన్ కార్డు నుండి కేజీ నుండి 2 కేజీల వరకు తూకాల్లో మోసం చేసి 200 క్వింటాళ్ల వరకు నొక్కేస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో రేషన్ బియ్యం విలువ ఒక క్వింటాల్ రూ .2000 వరకు పలుకుతుంది. ఎండియు ఆపరేటర్లు నొక్కేసిన బియ్యాన్ని స్థానిక గవి సిద్దేశ్వర రైస్ మిల్లులో అమ్ముకొని సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తుంది. ఇలా నెలకు ఒక రేషన్ సర్కుల్లోని ఆదాయం వస్తుంది. అదేవిధంగా ప్రభుత్వ ధరలు ప్రకారం కేజీ కందిబేళ్లు రూ.67 ఇవ్వాల్సి ఉండగా రూ.70 వసూలు చేస్తున్నారు. చక్కెర రూ.17 పాకెట్ ఇవ్వాల్సి ఉండగా రూ.20 వసూలు చేస్తున్నారు. అంతోదయ కార్డులకు రూ.6 పాకెట్ షుగర్ ఇవ్వాల్సి ఉండగా వారి నుండి కూడా రూ.20 వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. నెలకు ఒక ఎండియు ఆపరేటర్ వేలల్లో మిగతా 3లో

రోడ్డు ప్రమాదంలో నంద్యాల టిడిపి
అభ్యర్థికి గాయాలు

ప్రమాదానికి గురైన కారు, గాయపడిన ఫరూక్

నంద్యాల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ మంత్రి ఎన్ఎండి.ఫరూక్‌కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న కారు మంగళవారం పాణ్యం మండలం తమ్మరాజుపల్లె వద్ద బర్రెలను ఢీకొనడంతో స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. (వార్త మెయిన్‌లో...)

జిల్లా అన్ని విధాల అభివృద్ధి సాధించాలి

- ఉగాది వేడుకల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాబోయే రోజుల్లో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. క్రోధినామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజనను వేద పండితులు, అర్చకులు కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. తదనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తెలుగువారి పండుగలలో ఉగాది పండుగ ఎంతో గొప్ప పండుగన్నారు. ఉగాది పండుగ రోజున తీపి, పులుపు, చేదు, వగరు, ఉప్పు, కారంతో తయారు చేసిన ఉగాది పచ్చడిలాగే మనిషి జీవితంలో సంవత్సరం పొడవునా ఎదురయ్యే కష్టాలు, సుఖాలు, ఆనందాలు, మిగతా 3లో



జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనను కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న వేద పండితులు

వేసవి తాపానికి శీతలపానీయాలు

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి-పత్తికొండ..

2024 సార్వత్రిక ఎన్నికలలో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని జిఎంపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్ యాదవ్ కోరారు. పత్తికొండ సిపిఐ ఎమ్మెల్యే పి.రామచంద్రయ్యను, కాంగ్రెస్ ఎంపీ రాంపుల్లయ్యో యాదవ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని మంగళవారం మీడియాతో మాట్లాడారు. రాయలసీమలో అత్యంత వెనుకబడిన జిల్లా కర్నూలు ,కరువు కాటకాలతో అల్లాడుతున్న నియోజకవర్గం పత్తికొండ ఉందన్నారు. అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాగు,తాగునీరు ఇవ్వడంలో రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల సమయాలలో హామీ ఇస్తూ గెలిచిన వెంటనే గాలికి వదిలేస్తున్నారన్నారు. సమస్యలు పరిష్కారం కావాలంటే జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో మే 13న ఇండియా కూటమి అభ్యర్థులకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

వెల్దుర్తిలో ఘనంగా సుంకులమ్మ జాతర

ప్రజాశక్తి- వెల్దుర్తి

వెల్దుర్తిలోని వడ్డెగేరిలో సుంకులమ్మ అమ్మవారి జాతర మంగళవారం అట్టహాసంగా మొదలైంది. ఉగాది పండుగ సందర్భంగా అమ్మవారికి ఉదయం అభిషేకం అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులందరూ అమ్మవారికి నైవేద్యం సమర్పించి అనంతరం సాయంత్రం ఉత్సవ విగ్రహానికి ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ పురవీధుల్లో ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వడ్డే చిన్నోడు, చిరంజీవి, సురేష్, గాలి వెంకటేష్, ఎల్లనాగి, సంజీవ గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్యాస్ స్టౌ పేలి మహిళకు గాయాలు

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తి 14వ వార్డులో రెడ్డిపోగు ప్రశాంతి ఇంట్లో గ్యాస్‌స్టౌవ్ (ఇండేన్ గ్యాస్) పేలిన ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. వంటచేస్తుండగా ఉదయం 11 గంటల ప్రాంతంలో గ్యాస్‌స్టౌ పేలి ఇళ్లంతా పొగతో అల్లుకొని ప్రశాంతి శరీరం సుమారు 40 శాతం కాలింది. చుట్టుపక్కల ఇరుగుపొరుగువారు గ్యాస్ మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. కాలిన గాయాలైన రెడ్డి పోగు ప్రశాంతిని ఓ ప్రైవేటు కారులో హుటాహుటిన కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.ఆమెకు ఒక కొడుకు ఒక కూతురు ఉన్నారు.

-వినియోగదారులూ జరజాగ్రత్త !

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఒకప్పుడు మానవుడు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పనులు చేస్తూ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆరోగ్యంగా జీవనం సాగించేవాడు. మానవుని మేధాశక్తి పెరిగేకొద్దీ వేసవిలో చల్లదనాన్ని ఇచ్చే కూలర్లు, ఏసిలు, ఫ్యాన్లు వాడుకుంటూ కృత్రిమ ఆనందాన్ని పొందుతున్నాడు, గతంలో మట్టి కుండలో నీరు పోసి చల్లటి నీరును తాగి హాయిగా జీవించేవారు. నేడు ఫ్రిజ్జు, కూలింగ్ మిషన్ల ద్వారా నీళ్లను, ఐస్‌ల ద్వారా కృత్రిమ చల్లని పానియాలు తాగుతూ తన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నాడు. చెరుకు రసంలో సైతం ఐస్, పండ్ల రసాల్లో సైతం ఐస్ వేసి నోటికి అందిస్తే ఆహా ఏమి రుచి అనరా మైమరచి అనే విధంగా చల్లదనాన్ని ఆస్వాదిస్తూ శీతలపానియాలు తాగుతూ అనుభూతిని పొందుతున్నారు. దీనితో వచ్చే జబ్బులతో జోబుల్లో ఉన్న డబ్బులను ఖాళీ చేసుకుంటున్నారు.

కూల్, కూల్ : వేసవిలో ఎండలు మెండుగా ఉండడంతో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు చేరడంతో మానవుడు వేసవి తాపానికి తట్టుకోలేక ఎక్కడ చల్లని పానీయాలు దొరుకుతాయో అక్కడికి పరుగులు తీస్తున్నాడు. డబ్బు అంటే లెక్క లేకుండా విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నా తాత్కాలిగా చల్లదనాన్ని పొందుతున్నాడు

తప్ప ఆరోగ్యాల చెడి ఆ తర్వాత డాక్టర్ల చుట్టూ తిరిగి ధనం ధారాళంగా ఖర్చు చేసేస్తున్నాడు. తమ స్థోమతను బట్టి కాకుండా పక్కింటి ఇరుగుపొరుగు వారి చూస్తూ వారికి పోటీ పడుతూ తన తాహతకు మించి డబ్బులు ఖర్చు చేసి ఇండ్లలో కూలర్లు ఏసిలు ఫ్రిజ్జు కొని తెచ్చుకుంటున్నారు. అప్పులపాలై ప్రజల ముందు అప్పులు తీర్చలేక ఆభాస పాలవుతున్నారు. నగరంలో ఎటు చూసినా చెరుకు రసాలు, మజ్జిగ పండ్ల రసాలు కూల్ డ్రింకులు దర్శనమిస్తూ వారి వ్యాపారాలు మూడు పూవులు ఆరు కాయలుగా నిలుస్తున్నాయి. ఈ సమాజంలో ఎవరు పాడైపోయినా సరే డబ్బు సంపాదించిన వాడే మొనగాడు అనే విధంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాన్ని ఆశించే శీతల పానీయాలను అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఒకప్పుడు పాత సినిమాల్లో గోలి సోడాకు ఉన్న క్రేజ్ చాలా గొప్పది. 'సోడా సోడా ఆంధ్ర సోడా సోడా తాగరా తెలుగోడా చల్లని సోడా' లాంటి పాటలు ఇప్పటికీ ప్రాచీర్యంలోనే ఉన్నాయి. గోలి సోడా రోజురోజుకు అంతరించిపోతుంది. నగరంలో పదులలోపే గోలి సోడాలు అమ్మే కేంద్రాలు ఉన్నాయి. ఒకప్పుడు వీధుల వెంట సోడాలు, పుల్ల ఐస్ క్రీములు అమ్ముకొని జీవనం సాగించేవారు. నేడు ఫ్రిజ్జులో పెట్టుకొని అమ్మేస్థితికి చేరుకున్నారు.

శీతల పానీయాల ధరలు ఇలా : చెరుకు రసం సింగల్ ఐస్ తో రూ.10, ఫుల్లు ఐస్ లేకుండా రూ.15, మజ్జిగ రూ.పది ,గోలి సోడా రూ.10 , నన్నారి రూ20 , బాదంపాలు రూ.20, లస్సి రూ.30, ఫ్రూట్ మిక్స్ జ్యూస్ రూ.20 ,ఇది సాధారణ మనిషి తాగేవి. ఇక ధనికులు, ఉద్యోగస్తులు కొబ్బరినీళ్లు, వేసవిలో వచ్చే తాటి ముంజలు అలాంటివి ధర ఎక్కువైనా కొని తింటూ తాగుతున్నారు.మిల్క్ పార్లర్లలో పళ్ళ రసాలు ఏవి తీసుకున్న రూ.100 పైనే, ఇక స్పెన్సర్, డీ మార్ట్ లాంటి షాపింగ్ మాల్ లో మజా, స్ప్రైట్, కోకా కోలా, ఒకటికి ఒకటి ఆఫర్ అంటూ అమ్మడంతో ఎక్కువ శాతం ధనవంతులంతా కృత్రిమంగా తయారు చేసిన వాటిని ఫ్రిజ్జులో పెట్టుకొని ఎండ సమయాల్లో వాటిని తాగుతూ ఉంటారు. బస్టాండ్ లో రైల్వేస్టేషన్లో చిన్న చిన్న బాటిళ్ల స్ప్రింగ్ రూ.22 కేసర్ బాదం రూ.35 , మిరండా రూ.12, సెవెన్ అప్ రూ.22, స్లైస్ రూ.22 ట్రాఫ్టి రానా రూ.12 ఫ్రూటీ రూ.15 , మజా చిన్నది రూ.15 ఉన్నాయి. వేసవికాలంలో మానవుని అవసరాన్ని గుర్తించి వీటి రేట్లను పెంచి అమ్ముతున్నారు. ఏది ఏమైనా డాక్టర్ల సలహా మేరకు మట్టి కుండలోని నీరు తాగుతూ, సహజసిద్ధంగా ఇళ్లలో తయారు చేసుకున్న మామిడి, నారింజ, ద్రాక్ష, పైనాపిల్, ఆపిల్, కళింగర, కర్బూజా ఇలాంటి పండ్ల రసాలను, మజ్జిగ, తాగుతూ తమ ఆరోగ్యాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రోగాలు తెచ్చుకొని వేల రూపాయలు డాక్టర్లకు ఖర్చు పెట్టే కన్నా ఇండ్లలో తయారు చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచిస్తున్నారు.

పత్తికొండ బిసివై పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా మిద్దే వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-తుగ్గలి

పత్తికొండ నియోజకవర్గం భారత చైతన్య యువజన పార్టీ(బిసివై) అసెంబ్లీ అభ్యర్థిగా తుగ్గలి మండలం జొన్నగిరికి చెందిన మిద్దె వెంకటేశ్వర్లను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ మంగళవారం 175 నియోజకవర్గాలకు గాను ఏపిలో 32 మంది అభ్యర్థులను ప్రకటించారు. అందులో భాగంగా పత్తికొండ నియోజకవర్గానికి మిద్దె వెంకటేశ్వర్లును ప్రకటించారు. తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు సామాన్య రైతు కుటుంబంలో నుండి రాజకీయాల్లోకి వచ్చారు. యువకుడు ఉత్సాహవంతులు అయినా వెంకటేశ్వర్లను రాష్ట్ర అధ్యక్షులు బోడె రామచంద్రయ్య యాదవ్ మిద్దె వెంకటేశ్వర్లకు టికెట్ ఖరారు చేశారు. బిసివై అసెంబ్లీ అభ్యర్థి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గంలో చాలా అభివృద్ధి పనులు పెండింగ్లో ఉన్నాయని, అసెంబ్లీ అభ్యర్థిగా నన్ను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు.

జగన్‌ను ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యం

- రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్ర గౌడ్

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు: వైఎస్.జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే తన లక్ష్యమని రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఉగాది పండగ పర్వదినాన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడారు. జగన్ ప్రభుత్వం రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చి, అవినీతి రహిత పాలన అందించిన, ఇంటి ముందుకే ప్రభుత్వ ఫలాలు అందించిన జగన్‌నే మళ్లీ సిఎంను చేసుకోవాలనికోరారు.

ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకను అఖండ మెజారిటీతో గెలిపించాలని తెలిపారు. సలీమ్, అన్వర్ బాష, కెవిపి.సోమశేఖర్, గౌస్, బిఎన్.నాగరాజు, హరిశ్చంద్ర గౌడ్, మాధవస్వామి, డిష్ రఫిక్, జాకీర్ హుస్సేన్, కుమార్, ఖాజా, నాగేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి- సి బెళగల్

సిబెళగల్ లోని పెద్ద మసీదులో వైసిపి నాయకులు సంధ్య విక్రమ్ కుమార్ మంగళవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లింలకు అత్యంత పర్వదినం రంజాన్ అని ఉపవాస దినాలు అల్లాకు మిక్కిలి ప్రేమ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై భారలేస్తున్న పార్టీలను ఓడించండి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజలపై భారలేస్తున్న బిజెపి, వైసిపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను రాబోవు ఎన్నికలలో ఓడించాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ మొహమ్మద్ షరీఫ్ ప్రజలను కోరారు. మంగళవారం ఒకటో వార్డు, రెండో వార్డు వీధులలో తిరుగుతూ, ప్రజలను చైతన్య పరుస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అవలంబిస్తున్న ప్రజా, వ్యతిరేక విధానాలను ప్రజలందరూ ముక్త కంఠంతో ఎండగట్టాలని ఆయన కోరారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పెట్రోల్ డీజిల్, వంట గ్యాస్ ధరలు పెంచి, ప్రజలపై మోయలేని, భారాలను వేస్తూ ఉంటే,రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ,నేనేమి తక్కువ కాదని బియ్యం, బ్యాళ్ళ , చింతపండు ,మంచి నూనె ,ఇలా నిత్యవసర వస్తువుల ధరలను ,పెంచి ప్రజలు ధరలు కొనలేనంత, ఆకాశానికి రెక్కలు వచ్చేలా జగనన్న ప్రభుత్వం చేసిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వం పారిశ్రామికంగా, భవనాలు రోడ్లు ఎటువంటి అభివృద్ధి ,జరగలేదని కేంద్రంలోని ,బిజెపి ప్రభుత్వం ప్రత్యేక హోదా ,విభజన హామీలు ,రాయలసీమ ప్యాకేజీ, వెనుకబడ్డ జిల్లాలకు ఆదుకోవడానికి తీవ్రమైన ద్రోహం చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కనుక రాష్ట్రంలోని వైసిపి ,కేంద్రంలోని బిజెపితో అంటకాగిన టిడిపి, జనసేనలను చిత్తుచిత్తుగా ఓడించి వైసిపి టిడిపి బిజెపి మూడు పార్టీలను రాజకీయంగా

సమాధి కట్టాలని, ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మద్దిలేటి, ఎల్లప్ప ,ఎలీషా, మహబూబ్ బాషా, బాబు, నూర్ బాషా, బాబులి, శాలీ బాష, షాహిద్ పాల్గొన్నారు.

మామిడి రైతులకు నష్టపరిహారమివ్వాలి

- తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలి
- ఉద్యాన శాఖ అధికారికి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నష్టపోయిన మామిడి రైతులకు పంటల బీమా ద్వారా నష్టపరిహారం ఇవ్వాలని, తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్ ఉద్యాన శాఖ అధికారులను కోరారు. ఈ మేరకు రైతు సంఘం ప్రతినిధి బృందం జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజును మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లాలోని వెలుగోడు, ఆత్మకూరు, కొత్తపల్లి, గడివేముల, బేతంచెర్ల, బనగానపల్లె, మహానంది, చాగలమర్రి తదితర మండలాలలో వేలాది ఎకరాలలో మామిడి తోటలు రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా పడటం వల్ల మామిడి తోటలకు నల్ల తామర పురుగు సోకి 90 శాతం మామిడి పంట పూర్తిగా దెబ్బతిని రైతులు నష్టపోయారని చెప్పారు. ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో మొదటి పూత

మాట్లాడుతున్న నాయకులు

వస్తుందని, కానీ ఈ సంవత్సరం జనవరి నెలలో రెండోసారి పూత కూడా వచ్చిందని, ఆ పూత నిలబడక కాయ, పిందెలతో సహా రాలిపోయిందని తెలిపారు. రైతు సంఘం ఆధ్వర్యంలో వివిధ మండలాల్లో మామిడి తోటలను పరిశీలించామని చెప్పారు. ప్రతి సంవత్సరం కూడా ఈ తెగుళ్ల బారిన పడి మామిడి పంట పూర్తిగా దెబ్బతింటుందని ఉద్యాన అధికారుల దృష్టికి తెచ్చారు. వీటికి తోడు ప్రతి సంవత్సరం అతివృష్టి, అనావృష్టి వల్ల మామిడి పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. రైతులు అప్పు చేసి ఎకరాకు రూ. 50 వేలకు పైగాపెట్టుబడి పెట్టి నష్టపోతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటలకు ప్రత్యేక ప్రోత్సాహాలు ఇస్తామని ప్రకటించినా నేటికి అమలయ్యే పరిస్థితి ఆచరణలో లేదన్నారు. ఉచిత బోర్లు, డ్రిప్, స్ప్రింగ్ పరికరాలు సబ్సిడీ మీద ఇవ్వడం లేదన్నారు. మామిడికి సోకే చీడలపై ఉద్యానవన శాఖ అధికారులు కనీసం రైతుల్లో అవగాహన కల్పించే ప్రయత్నం కూడా చేయడం లేదన్నారు. నల్ల తామర పురుగు నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని, దాంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మామిడి తోటలకు పంటల బీమా సౌకర్యం కల్పించాలని, మామిడి రైతులకు ఉచిత బోర్ల పథకం అమలు చేయాలని కోరారు. ఎకరానికి రూ. 50 వేలు నష్టపరిహారం చెల్లించాలని, మామిడికి సోకే తెగుళ్లను నివారించడానికి ఉద్యానవన శాఖ అధికారులు రైతులలో అవగాహన కల్పించాలన్నారు. ఉచిత బోర్లు, డ్రిప్, స్ప్రింగ్ పరికరాలు సబ్సిడీ మీద అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.సుబ్బరాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి సురేష్, జిల్లా నాయకులు ఓ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న రథోత్సవం



రమావాణీసేవిత రాజరాజేశ్వరి అలంకారం

మొదటి పేజీ తరువాయి... చిందు కర్ణాటక జాంజ్ వీరగాసి కొమ్ము వాయిద్యం, కన్నడ డోలు, నంది కోలు సేవ కంచుడోలు , వంటి వివిధ రకాల నృత్య ప్రదర్శనలతో రథసాల వద్ద నుండి నంది గుడి వరకు నంది గుడి వద్ద నుండి రథశాల వరకు లక్షలాదిమంది భక్తుల మధ్య రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రమావాణీసేవిత రాజరాజేశ్వరి అలంకారం : ఉగాది ఉత్సవాలలో భాగంగా మంగళవారం నాడు రమావాణీసేవిత రాజరాజేశ్వరి అలంకారం అలంకారంలో అమ్మవారి దర్శనం ఇచ్చారు. రమావాణీసేవిత రాజరాజేశ్వరి అలంకారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పంచాంగ శ్రవణం: నూతన సంవత్సరం శ్రీ క్రోధి నామ సంవత్సరం పురస్కరించుకొని క్షేత్రంలోని ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మండపంలో పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఎస్పి కె.రఘువీరారెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు, వేద పండితులు ఉబయ దేవాలయాల ప్రధాన అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. రాజమండ్రికి చెందిన పండిత బుట్టే వీరభద్ర దైవాజ్ఞ వారిచే పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాక్షి విలేఖరికి సతీ వియోగం

- నివాళులు అర్పించిన కాటసాని తిరుపాల్ రెడ్డి, ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని మిట్టపల్లె గ్రామంలో సాక్షి ఆర్సీ ఇన్‌ఛార్జి, ఎపిడబ్ల్యూజెఎఫ్ బనగానపల్లె నియోజకవర్గ అధ్యక్షులు గుండం సర్వేశ్వర రెడ్డి సతీమణి గుండం వెంకట లక్ష్మమ్మ(58) అనారోగ్యంతో మంగళవారం మతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, ఇల్లూరు కొత్తపేట సర్పంచి రమణలు ఆమె భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఈ సందర్భంగా కాటసాని తిరుపాల్ రెడ్డి మాట్లాడుతూ గుండం సర్వేశ్వర రెడ్డి తమ కుటుంబంలో సభ్యుడు లాంటివారని, ఆయన సతీమణి మృతి బాధాకరమన్నారు. కార్యక్రమంలో కాటసాని రామకృష్ణారెడ్డి, ఇల్లూరు కొత్తపేట గ్రామ సర్పంచి గోగుల రమణ, కాపులపల్లె వెంకటేశ్వర్లు, కిషోర్, రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, నాగిరెడ్డి, సురేష్ కుమార్ రెడ్డి, గౌండ కంభగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యూజెఎఫ్ నివాళి : ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా కన్వీనర్ జి.మద్దయ్య యాదవ్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, కార్యదర్శి షాషావలి, మండల అధ్యక్షులు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, జర్నలిస్టులు వెంకట రాముడు, సుధాకర్, బాలు, మనోహర్ తదితరులు వెంకటలక్ష్మమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

జిల్లా అన్ని విధాల అభివృద్ధి సాధించాలి

మొదటి పేజీ తరువాయి... బాధలన్నిటికీ ఉగాది పచ్చడి ప్రతీక అని అన్నారు. అన్నిటిని సమానంగా స్వీకరించాలనే సందేశాన్ని ఉగాది పచ్చడి మనకు తెలియజేస్తుందన్నారు. ఉగాది పేరులోనే యుగ ఆది అనే అర్థం ఉందని, అనగా ఈ ఏడాది ప్రారంభమని, తెలుగువారికి ఉగాది పండుగతోనే సంవత్సరం ప్రారంభమవు తుందన్నారు. ప్రజలందరూ సుఖ, సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనరు, విజయవాడ వారి సూచనల మేరకు క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు-2024 సందర్భంగా కర్నూలు జిల్లాలోని దేవాలయాల్లో పనిచేస్తున్న ఒక వేదపండితుడు, ఇద్దరు అర్చకులను గుర్తించి ఒక్కొక్కరికి రూ.10,116 సంభావన, శాలువ, పండ్లు, ప్రశంస పత్రాలను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ నారాయణరెడ్డి, వేద పండితులు మల్లికార్జున శర్మ, అర్చకులు సత్యనారాయణ స్వామి, నరసింహమూర్తి, దేవాదాయ ధర్మదాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూర్ మండలంలో తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుండి పట్టణంలోని పలు దేవాల యాలు కిటకిటలాడాయి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు ఉగాది పంచాంగాన్ని ఆ దేవాలయ పరిధిలో ఉన్న అర్చకులు ప్రజలకు వివరించారు. ఇళ్లల్లో సాంప్రదాయ వంటలను వండడంతో పాటు వాటిని ఇంటి పక్కల్లో ఉంటున్న క్రైస్తవ, ముస్లిం సోదరులకు సైతం హిందువులు అందించడం జరిగింది. **కొత్తపల్లి :** మండలంలోని తాండవ మల్లేశ్వర స్వామి వారికి, పార్వతి దేవి అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పంచాంగ శ్రవణం గ్రామ పెద్దల సమక్షంలో గ్రామ పురోహితులు పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. పెద్దఎత్తున యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు అందరు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో గల సుంకులమ్మ దేవాలయంలో ఉదయం నుంచి సుంకులమ్మ దేవాలయానికి భక్తులు పోటెత్తారు. **బేతంచర్ల :** బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో వెలిసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో క్రోధినామ సంవత్సర తెలుగు సంవత్సరాది ఉగాది పండుగలు పురస్కరించుకొని స్వామివారి ఆలయ ఆవరణంలో ఈవో ఎం రామాంజనేయులు, చైర్మన్ సీతారామ చంద్రుడు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం వినిపించడం జరిగింది. ఆలయ వేద పండితులు జ్వాలా చక్రవర్తి, మద్దిలేటి స్వామి, కళ్యాణ్ చక్రవర్తి తదితరులు స్వామి వారికి పంచమామృత అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. **బనగానపల్లె :** మండలంలో క్రోధి నామ సంవత్సర తెలుగు ఉగాది పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాలలో దేవస్థానాల్లో, ఆలయాల్లో వేద పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. **పాణ్యం :** పాణ్యం మండలంలోని అన్ని గ్రామాలలో ఉగాది పర్వదిన వేడుకలు ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుండే రంగుల బండ్లు కట్టి గ్రామ వీధుల గుండా తిప్పారు. యువత కేరింతలతో వసంత ఉత్సవం జరుపుకున్నారు. **రుద్రవరం :** వాసాపురం వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో క్రోధినామ సంవత్సర ఉగాది పండుగ పర్వదినం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పంచాంగ శ్రవణ కార్యక్రమం దేవస్థానం ప్రధాన అర్చకులు వారణాసి గోపి శర్మ నిర్వహించి రాశి ఫలాలు వివరించారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ చైర్మన్ సింగతల మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులు లింగం వెంకట రంగ నాయకులు శెట్టి, కోశాధికారి కానాల ఈడిగ నరసింహులు, భక్తులు పాల్గొన్నారు. **మిడుతూరు :** మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి దేవాలయ స్వామివారి పాదల చెంతకు సూర్య కిరణాలు పన్నప్పుడే నిజమైన ఉగాదిని గ్రామ ప్రజలందరూ చర్చించుకుంటారు. చెన్నకేశవ స్వామి దేవాలయం నిర్మించి దాదాపు 600 సంవత్సరాలు గడుస్తున్నా గ్రామస్తులు చర్చించుకుంటారు. ప్రతి ఉగాది రోజు సాయంకాలం ఆరు గంటలకు సూర్య కిరణాలు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి పాదాల మీద పడుతాయి. ప్రతి సంవత్సరం కేవలం ఉగాది పండుగ రోజు పండగ పోయిన వారం రోజుల వరకు సూర్యకిరణాలు చెన్నకేశవ స్వామి పాదాల చెంతకు చేరుతాయి.

పాణ్యం: స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లిలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు

శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఇఒ ఎం రామాంజనే యులు, చైర్మన్ సీతారామ చంద్రుడు తదితరులు

రుద్రవరం : పంచాంగ శ్రవణం వినిపిస్తున్న వేద పండితుడు

ఘనంగా ఉగాది వేడుకలు

మొదటి పేజీ తరువాయి... పెద్దమ్మ, సుంకులమ్మ ల దేవస్థానాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాలలో వేద పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు.

యాగంటి దేవస్థానంలో : మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి శ్రీ ఉమా మహేశ్వరస్వామి దేవస్థానంలో ఉగాది సందర్భంగా ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, పాలకమండలి సభ్యుల ఆధ్వర్యంలో సాయంత్రం పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండియుల నిలువు దోపిడీ

మొదటి పేజీ తరువాయి... సంపాదిస్తున్నారు. ప్రభుత్వం ఒక ఎండియుకు సరుకులు పంపిణీ చేసేందుకు గాను నిర్వహణ ఖర్చుల కింద నెలకు రూ.21000 ఇన్సెంటివ్ అందిస్తున్నప్పటికీ రేషన్ కార్డు దారుల నుండి అక్రమాలకు పాల్పడుతూ భారీగా సంపాదిస్తున్నారు.

అధికారుల నిఘ పర్యవేక్షణ కరువు

ఎండియులు రేషన్ కార్డుదారులకు పంపిణీ చేస్తున్న సరుకులు సక్రమంగా అందుతున్నాయా , ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు సరుకులను అందిస్తున్నారా లేదా అనే కోణంలో నిఘా ఉంచి ప్రతి నెల పర్యవేక్షించవలసిన అవసరం ఉంది. అయితే రెవిన్యూ, విజిలెన్స్ అధికారులు ఇంత అక్రమాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం వెనక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాహనాల ద్వారా సక్రమంగా బియ్యం పంపిణీ చేయకుండా బహిరంగంగా నిలువు దోపిడీకి పాల్పడుతున్న ఎండియు ఆపరేటర్ల పై జిల్లా కలెక్టర్ స్పందించి కఠిన చర్యలు తీసుకొని ప్రస్తుత కరువు పరిస్థితుల్లో రేషన్ కార్డుదారులకు న్యాయం జరిగేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం: ఆర్ఐ డినోద్‌కుమార్

ఎండియు ఆపరేటర్ బసవరాజు లాంటి వారు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని విచారించి తగుచర్యలు తీసుకుంటాం. మండలంలోని అన్ని ఎండియు ఆపరేటర్లపై కూడా విచారణ చేస్తాం.

ఆస్తి తగాదాలో తండ్రిపై కొడుకు దాడి

- చికిత్స పొందుతూ మృతి

ప్రజాశక్తి - మిడుతూరు

ఆస్తి తగాదాలో కన్న తండ్రినే కొడుకు చంపిన ఘటన మిడుతూరు మండలంలోని తలముడిపి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. తలముడిపి గ్రామంలో సోమ వారం నాడు కురువ అయ్యన్న (85) తన కుమారులైన శ్రీనివాసులు, బాలుడులకు ఆస్తి పంపకం చేపట్టారు. ఈ సందర్భంగా చిన్న కుమారుడైన శ్రీనివాసులు తనకు ఆస్తి తేడా పెంచాడని ఉద్రేకంతో తండ్రిని కర్రతో తలపైన కొట్టాడు. తలకు బలమైన గాయం కావడంతో వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం చికిత్స పొందుతూ మరణించాడు. పెద్ద కుమారుడు బాలుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టర్ నిర్వహించి వారికి అప్పజెప్పామని ఎస్సై జగన్మోహన్ తెలిపారు.

మృతిచెందిన అయ్యన్న

వైసిపి పాలనకు చరమగీతం పాడాలి

భూమా అఖిల ప్రియ

ప్రజాశక్తి - చాగలమర్రి

వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడాలని మాజీమంత్రి, ఆళ్లగడ్డ తెదేపా అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం చాగలమర్రి పట్టణంలోని 15,16 వార్డుల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో వైకాపాకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధమయ్యారని ఆమె వివరించారు. కార్యక్రమంలో మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్సర్బషా, నాయకులు అలంసాగారి మౌలాలి, హనీఫ్, మాబులాల్, గఫార్, రియాజ్, కరిముల్లా, అజీం, బారిక్షమల్ పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న భూమా అఖిలప్రియ

మండలంలోని జ్ఞానాపురం కదిరిపురం తండా గ్రామాలలో ఇంటింటికి తిరిగి టిడిపి, మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్‌లో పొందుపరిచిన అంశాలను టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. టిడిపి అధికారంలోకి రాగానే మహిళలకు ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అంద జేయడం జరుగుతుందని అదే విధంగా మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఉచిత బస్సు ప్రయాణం తల్లికి వందనం ఆడబిడ్డ నిధి, కలలకు రెక్కలు వంటి పథకాల ద్వారా మహిళా అభ్యున్నతికి టిడిపి ప్రభుత్వం అండగా నిలుస్తుంద న్నారు. నాడు తెలుగుదేశం హయాంలో మాజీమంత్రి భూమా అఖిల ప్రియ కృషితోనే చాగలమర్రి పట్టణంలో, ఆళ్లగడ్డ నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని మీ ఇంటి ఆడపడుచు గా ప్రతి ఒక్కరికి సహాయ సహకారాలు అందించారని ఎల్లప్పుడూ అన్నివేళలా ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమ న్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేయు చున్న భూమా అఖిలప్రియకి, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయుచున్న బైరెడ్డి శబరి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిం చాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, నాయకులు శేఖర్ రెడ్డి నారాయణరెడ్డి నరసింహా రెడ్డి హరిచంద్ర రెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న భూమా జగద్విఖ్యాత్ రెడ్డి

వైసిపి నుండి టిడిపిలో చేరిక

పార్టీలోకి చేరిన కార్యకర్తలతో భార్గవ్ రామ్ నాయుడు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండలం అప్పనపల్లె గ్రామంలో పెద్ద కంబలూరు గ్రామానికి చెందిన వైసిపి శ్రేణులు టిడిపిలో చేరారు. మంగళవారం ఉగాది పండగ సందర్భంగా అప్పనపల్లి గ్రామానికి చెందిన సుద్దుల ప్రసాద్ యాదవ్ ఆహ్వానం మేరకు విచ్చేసిన భార్గవ్ రామ్ నాయుడు ఆధ్వర్యంలో యర్రం ప్రతాపరెడ్డి పర్యవేక్షణలో పెద్ద కంబలూరు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన వార్డు మెంబర్ పుల్లమ్మ, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షులు గుర్రప్ప, ప్రసాదు, లాజరు, భజనన్న, నరేష్ వీరితోపాటు పలు కుటుంబాలు వైసిపి నుండి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా భార్గవ్ రామ్ నాయుడు పార్టీలోకి చేరిన వారందరికీ టిడిపి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో చిన్నకంబలూరు జంగా వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు యాదవ్, వెంకటరామయ్య యాదవ్, నాగయ్య, ఉల్లెడ మల్లు, శ్రీనివాసులు యాదవ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

వైసిపి జెండా ఎగరేస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : రానున్న ఎన్నికల్లో ఆళ్లగడ్డలో మరోసారి వైసిపి జెండా ఎగరవేస్తామని ఎమ్మెల్యే గంగుల నాని అన్నారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల గ్రామంలో 150 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్ఆర్సిపిలో మంగళవారం చేరారు. కొంకల కృష్ణారెడ్డి, బద్రి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్‌లు బత్తుల సుబ్బారాయుడు, మైసూర్ ఓబులేసు, ఈశ్వరయ్య, సాంబ శివుడు, రామకృష్ణ, లక్ష్మీ నరసయ్య, నరసింహ బ్రదర్స్, ఖాసిం వలి, మద్దూరు శ్రీను, వెంకట రమణ, కరీముల్లా, చంద్ర, ఓబులేసు, కరీ ముల్లా, హేమంత్ ధర్మ, అనిల్, వంశీ, సంజీవ బ్రదర్స్‌లను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సంద`ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమను నమ్మి పార్టీలో చేరిన వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో విజయ డైరీ డైరెక్టర్ గంగుల విజయ సింహా రెడ్డి, పెట్ల గోపాల్, పెట్ల రాజా, పెట్ల చిన్న గోపాల్, మంగలి పురుషోత్తం, సుబ్బయ్య, బివి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైకాపాలో చేరిన నేతలు

బండలాగుడు పోటీలు ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న టిడిపి యువ నాయకుడు గణేష్ రెడ్డి

ప్రజాశక్తి - గడివేముల

మండలంలోని పైభోగుల గ్రామంలోఉగాది పండుగ సందర్భంగా ఎద్దుల బండలాగుడు పోటీలను టిడిపి యువ నాయకుడు గణేష్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ పోటీలలో ఎనిమిది జతల ఎద్దుల బండ లాగుడు పోటీలలో పాల్గొన్నాయి. ఈ పోటీలలో గెలుపొందిన ఎద్దుల యాజమానులకు మొదటి బహుమతి ఉండుట్ల గ్రామం చెందిన దోర్నాల నాగ మద్దిలేటి ఏడువేల రూపాయలు, రెండో బహుమతి కే బొల్లవరం గ్రామానికి చెందిన ఆంజనేయులు నాయక్ రూ.500, మూడవ బహుమతి ఉండుట్ల గ్రామానికి చెందిన తలారి రామ గోవిందు రూ.3000 లను గ్రామ సర్పంచ్ గంగాధర్ రెడ్డి, వైబోగుల డాక్టర్ శివశంకర్, టిడిపి యువ నాయకుడు గణేష్ రెడ్డి ఎద్దుల యాజమాన్లకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ మంత్రి

దర్శనానికి వస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఉగాది పండుగ సందర్భంగా దొర్నిపాడు మండలం గోవిందిన్నే గ్రామంలోని పెద్దమ్మ తల్లిని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, టిడిపి తాలుకా యువ నాయకులు భూమా విఖ్యాత్ రెడ్డి దర్శించుకున్నారు. ఉగాది పండుగను నియోజకవర్గ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే కొత్త దుస్తులు ధరించి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరివెళ్ల గ్రామంలో, బత్తులూరు గ్రామంలో మారెమ్మ ఆలయానికి ప్రజలు చేరుకుని తమ మొక్కులను చెల్లించుకున్నారు. గ్రామాలలో వేద పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు.

'మేము టిడిపిలోకి చేరలేదు'

ప్రజాశక్తి - బేతంచెర్ల

తాము టిడిపిలోకి చేరలేదని మండల పరిధిలోని కనుమ కింది కొట్టాల గ్రామస్తులు జంగిడి సుబ్బయ్య, జంగిటి చిన్న మద్దయ్య, జంగిటి ఎల్లయ్య, చాకలి మల్లయ్యలు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ తాము టిడిపిలోకి చేరలేదని, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ తమ గ్రామానికి వచ్చారని చూసి కలవడానికి అని వెళ్తే తెలుగుదేశం పార్టీ కండువా కప్పి టిడిపిలోకి చేరినామని తెలపడం సరైనది కాదన్నారు. టిడిపి అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నేతలు మమ్మల్ని కోరినా గ్రామ అభివృద్ధికి కృషి చేసిన ఆర్థిక మంత్రి బుగ్గనకే వచ్చే ఎన్నికల్లో మా మద్దతు ఉంటుందని తెలిపా మన్నారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, వైసిపి నాయకులు గూని నాగరాజు, గూని చిన్న మహేష్, గోపాల్,మణి వర్ధన్ రెడ్డి, రాఘవేంద్రారెడ్డి, పాణ్యం రామ్ మోహన్ రెడ్డి, నవీన్ సాయి సమక్షంలో గ్రామస్తులు జంగిటి సుబ్బయ్య, జంగిటి చిన్న మద్దయ్య, జంగిటి నాగ శేషుడు, తదితరులు వైసిపిలో చేరారు.

మాట్లాడుతున్న నాయకులు

బైరి వెంకటమ్మ, బైరి చిన్న పుల్లన్న మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

పరుగు పందెం పోటీలు

ప్రజాశక్తి - రుద్రవరం

మండల కేంద్రం రుద్రవరంలోని బైరి వెంకటమ్మ, బైరి చిన్న పుల్లన్న మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వాహకులు పరుగు పందెం పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బైరి శ్రీహరి, బైరి బ్రహ్మం మాట్లాడుతూ తమ తల్లి తండ్రి పేరు మీద ట్రస్ట్ ఏర్పాటుచేసి సామాజిక కార్యక్రమంలో పాటు యువతను ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాదిఉగాది పర్వదినం సందర్భంగా గత నాలుగు సంవత్సరాల నుంచి పరుగు పందెం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా నిర్వహించిన పోటీలలో నిర్వహించిన పరుగు పందెం పోటీలలో యువకులు పోటా పోటీగా పాల్గొన్నారు. వీరిలో మొదటి పందెం విజేతలు సూరమ్మ గారి నబి, గుమ్మల రాముడు, బోయిలకుంట్ల ప్రతాప్, రెండో పందెం విజేతలు కోలా లక్ష్మీనారాయణ, నూరమ్మ గారి ఇర్ఫాన్, అన్నలదాసు హరినాథ్, విజేతలుగా నిలవగా వీరికి వెండి పథకాలను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కేసి,నరసింహులు, దేవగుడి రెహమాన్, లింగం బ్రహ్మయ్య, నెంబర్ వన్ హుస్సేన్, డేగల చెన్నయ్య, లాజరస్, శౌరి, రాజేష్, రాజు, లింగం దిన్నె వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలను అభినందిస్తున్న నేతలు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

కమిషనర్ టి సుధాకర్ రెడ్డి

పెద్ద డస్ట్ బిన్ లు నిండిన వెంటనే డంపు యార్డుకు తరలించాలి

చలివేంద్రాల్లో 24 గంటలు మంచినీరు ఉండేలా చూడాలి

ప్రజాశక్తి - నందికొట్కూరు- టౌన్

నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణతో పనులు పూర్తి చేసేందుకు కార్యాచరణ చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ టి సుధాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం నందికొట్కూరు పట్టణంలో పలు ప్రధాన వీధులలో ఉన్న మురుగు కాలువలలో సిల్ట్ తీయడం, ఇతర పారిశుద్ధ్య పనులు, కాలువ లను ఆయన పరిశీలించారు. వీధులలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెత్త నిల్వ కేంద్రాలని, పెద్ద డస్ట్ బిన్ లని నిండిన వెంటనే డంపింగ్ యార్డ్‌కు తరలించాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం వేసవి దృష్టిలో పెట్టుకుని పట్టణంలో పురపాలక సంఘ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాలను పరిశీలించారు. చలివేంద్రాలలో ఏర్పాటు చేసిన కుండల్లో 24 గంటలు మంచినీరు ఉండేలా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి లో సిబ్బంది పరిశీలిస్తుండాలని, ఖాళీ అయిన వెంటనే నీటితో నింపాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, ఏఈ మనోజ్ కుమార్, శానిటేషన్ సెక్రటరీలు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ టి సుధాకర్ రెడ్డి

కనుల పండువగా రథోత్సవం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ఉగాది సందర్భంగా పెద్దకడబూరులో వెలసిన శ్రీఆంజనేయస్వామి రథోత్సవం మంగళవారం కనుల పండువగా సాగింది. ఆలయ ధర్మకర్త నరవ రమాకాంతరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి రథాన్ని పుష్పాతో అలంకరించారు. సాయంత్రం ఆలయ ధర్మకర్త నరవ రమాకాంతరెడ్డి ఇంటి నుంచి స్వామివారి పూర్ణకుంభాన్ని మంగళవాయిధ్యాలతో ఊరేగింపుగా శ్రీఆంజనేయ స్వామి గుడి వద్దకు తెచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తిని రథంపై ప్రతిష్టించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథోత్సవం ఆదోని రహదారిలోని శ్రీసీతారాముల దేవాలయం వరకు సాగింది. మాజీ ఎంపిపి నరవ శశిరేఖ, టిడిపి నాయకులు ఏసేపు, మల్లికార్జున, మీసేవ ఆంజనేయులు పాల్గొన్నారు.

పెద్దకడబూరులో రథోత్సవం నిర్వహిస్తున్న ప్రజలు

కమనీయం.. జనార్ధన స్వామి రథోత్సవం

ఆస్పరి : ఆస్పరిలో శ్రీజనార్ధన స్వామి రథోత్సవం కమనీయంగా సాగింది. మంగళవారం సాయంత్రం దారప్ప ఓబు రెడ్డి ఇంటి నుంచి బోనకుండలో స్వామివారికి నైవేద్యం తీసుకొని రథోత్సవం దగ్గరకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవం ముందుకు కదిలింది. ఉగాది సందర్భంగా ఆస్పరితో పాటు ఆయా గ్రామాల్లోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా సిఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఉగాది సందర్భంగా ప్రభోత్సవాలు

ఆలూరు : ఉగాది సందర్భంగా మండలంలోని మనేకుర్తి గ్రామంలో శ్రీరామలింగేశ్వర స్వామి, ముసానహల్లిలో సోమలింగేశ్వర స్వామి ప్రభోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం మనేకుర్తిలో ఆలయ పూజారి ఇంటి నుంచి కుంబాలు, గ్రామస్తుల ఇళ్ల నుంచి నందకళ్లను మేళ తాళాలతో ఆలయానికి తీసుకొచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రామలింగేశ్వర స్వామి విగ్రహాన్ని ప్రభోత్సవం ద్వారా ఎదురు బసవన్న వరకు తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. తిరిగి స్వామివారిని ఆలయంలో ప్రతిష్టించారు.

ఉగాది పర్వదినంగా..
ఖరీఫ్ పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పొలం పనుల్లో రైతులు

ఉగాది రోజే కొత్త సంవత్సరంలో వ్యవసాయ పనులను సైతం ప్రారంభిస్తారు. ఇప్పటికే రైతులు తమ పంట పొలాల్లో పత్తిని పీకేసి భూములను చదును చేశారు. ఈ భూముల్లో క్రోధినామ సంవత్సరంలో దుక్కిదున్ని వ్యవసాయ పనులను ప్రారంభించారు. ఈ మేరకు అవసరమైన పరికరాల కొనుగోలు, తయారీ చేపట్టడంలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలో ఉగాది పండగ రోజున రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించారు. ఉదయం సూర్యోదయం వేళ ఎద్దులు, వ్యవసాయ పనిముట్లతో వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. క్రోధినామ సంవత్సరంలో పంటలు బాగా పండాలని, మంచి ధరలు పలకాలని, రైతులు సంతోషంగా ఉండాలని వారు కోరుకున్నారు.

భానుడి భగభగలు...

- ఆదోనిలో 42 డిగ్రీలు నమోదు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

భానుడి భగభగలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. నిప్పులు కురిపిస్తూ సూర్యుడు అందరినీ బెంబేలెత్తిస్తున్నాడు. మంగళవారం ఆదోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏకంగా 42 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా 25 నుంచి 30 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. రాత్రిళ్లు ఉక్కపోత బాగా పెరిగింది. ఉష్ణోగ్రతలకు తోడు వడగాల్పులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

జాగ్రత్తలు తప్పనిసరి

మరికొన్ని రోజులు ఉష్ణోగ్రతలు ఇలానే నమోదు కావచ్చని పెద్ద హరివాణం పిహెచ్‌సి డాక్టర్ ఇమ్రాన్ తెలిపారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకపోవడం మంచిదని పేర్కొన్నారు. తరచూ తాగునీరు, నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరినీళ్లు, లస్సీ, ఒఆర్ఎస్, గ్లూకోజ్, పండ్లరసాలు లాంటివి తీసుకోవాలన్నారు. గొడుగు, టోపీ లాంటివి, అలాగే వదులుగా ఉండే లేతరంగు కాటన్ దుస్తులు ధరించాలని తెలిపారు. సూర్యకాంతి నేరుగా శరీరంపై పడకుండా కళ్లజోడు, చేతిరుమాలు లాంటివి రక్షణగా వేసుకోవాలని సూచించారు. దుద్దుర్లు, తిమ్మిర్లు, బలహీనత, మైకం, తలనొప్పి, వికారం, చెమటలు, మూర్ఛలు లాంటి సంకేతాలను ముందస్తుగా గుర్తించి తగిన వైద్య సలహాలు తీసుకుంటే వడదెబ్బ నుంచి కాపాడుకోవచ్చన్నారు. పని ప్రదేశాల్లో రైతులు, శ్రామికులు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏమైనా పనులుంటే ఉదయం, సాయంత్రానికి మార్చుకోవాలన్నారు.

శ్రీమఠంలో పంచాంగం శ్రవణం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో పండితులు ఎస్.వాదిరాజాచార్ పంచాంగ శ్రవణం చేశారు. మంగళవారం ఉగాది సందర్భంగా శ్రీమఠం ఆధ్వర్యంలో రచించిన పంచాంగాన్ని వివరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో 12 రాశులకు సంబంధించిన అంశాలను పరిగణనలోకి భక్తులకు తెలిపారు. ఆయా రాశుల వారి ఆదాయ, వ్యయాలు, ఏయే రాశుల వారికి ఎలా ఉండబోతున్నది వివరించారు. పండిత కేసరి, రాష్ట్రపతి ప్రతిభ అవార్డు గ్రహీత, డాక్టరేట్, మహామహోపాధ్యాయ బిరుదాంకితులు రాజా ఎస్.గిరియాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

పంచాంగ శ్రవణం చేస్తున్న వాదిరాజాచార్

వీరభద్ర గౌడ్‌కు మద్దతుగా
టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - హాలహర్వి

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బి.వీరభద్ర గౌడ్‌కు మద్దతుగా మంగళవారం హాలహర్వి గ్రామంలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టిడిపి మండల నాయకులు ఇంటింటికీ తిరుగుతూ టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈసారి టిడిపికి ఓటు వేసి వీరభద్ర గౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబుకు మద్దతుగా నిలవాలని తెలిపారు. ప్రజల నుంచి మంచి స్పందన ఉందని, వీరభద్ర గౌడ్ అత్యధిక మెజారిటీతో గెలుస్తారని చెప్పారు. మండల నాయకులు అసుండి శ్రీధర్, మారుతి చౌదరి, నాగరాజు బాబు పాల్గొన్నారు.

బాబుతోనే అభివృద్ధి

- టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతోనే అభివృద్ధి సాధ్యమని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కె.తిమ్మాపురం గ్రామానికి చెందిన సిపిఐ నాయకులు బిటి.బతకన్న, బిటి.మద్దిలేటి, బిటి.మల్లికార్జున, బిటి.శ్రీరాములు, వెంకటేష్, హేమంత్ నాయుడు, వీరాంజనేయులు, రాజు, తిరుమలేష్ గౌడ్, లింగమూర్తి, రామలింగప్ప, బిటి.రాముడు, బిటి.సుదర్శనం, చిన్న నాగేష్, బిటి.వెంకటేష్, తిమ్మప్ప, వీరస్వామి, చంద్ర, వారి అనుచరులు సుమారు 100 మంది టిడిపి కె.తిమ్మాపురం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉమ్మడి కూటమి ప్రవేశ పెట్టిన వివిధ పథకాలకు ఆకర్షితులమై టిడిపిలో చేరినట్లు తెలిపారు.

బీవీ సమక్షంలో టిడిపిలో చేరుతున్న నాయకులు

అధిష్ఠానం ఆదేశిస్తే పోటీకి సిద్ధం

- కాంగ్రెస్ నాయకులు ఉమ్మి యూసుఫ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, కాంగ్రెస్ అధిష్టానం ఆదేశిస్తే ఆదోని నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటానని ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన ఉమ్మి యూసుఫ్ తెలిపారు. మంగళవారం ఆదోనిలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఇతరులకు ఇచ్చినా వారితో కలిసి పని చేస్తానన్నారు. అభివృద్ధి జరగాలంటే ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు.

టిడిపితోనే సంక్షేమం, అభివృద్ధి

- టిడిపి అభ్యర్థి వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి - దేవనకొండ

రాష్ట్రంలో అభివృద్ధిని మరిచిన వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించి, టిడిపిని అధికారంలోకి తెచ్చుకుంటే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్ర గౌడ్ తెలిపారు. మంగళవారం మండలంలోని గద్దెరాళ్ల, నెల్లిబండ, బండగట్టు, మాచాపురం, కరివేముల గ్రామాల్లో పర్యటించి ప్రచారం నిర్వహించారు. ముందుగా గద్దెరాళ్ల గ్రామంలో మారమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి మరిచిందని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రోడ్లు, తాగునీటి సమస్య నివారణకు నిధులను ఇస్తామని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో వైసిపి విఫలమైందని విమర్శించారు. మండలంలో హంద్రీ నీవా సుజల స్రవంతి పంట కాలువల నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపుతామన్నారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. టిడిపి మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు ఉచ్చీరప్ప, బడిగింజల రంగన్న, రామారావు నాయుడు, మలకన్న, ఆకుల వీరేష్, వెంకట స్వామి గౌడ్, రాజశేఖర్ గౌడ్, మల్లికార్జున గౌడ్, కప్పట్రాళ్ల మల్లికార్జున, వెలమకూర్ సర్పంచి భాస్కర్, బేతపల్లి సర్పంచి మహేశ్వర్ రెడ్డి, కప్పట్రాళ్ల సర్పంచి చెన్నమ నాయుడు, ఎంపిటిసి తిమ్మప్ప, తెలుగు యువత అధ్యక్షులు రాజాసాబ్, నాయకులు నాగేష్, సూరన్న, కౌలుట్ల, సుంకన్న పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న వీరభద్ర గౌడ్

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ క్రాస్ రోడ్డు వల్ల ఎఐటియుసి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. మంగళవారం ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మద్దిలేటి శెట్టి, ఎఐటియుసి జిల్లా నాయకులు ఎం.కృష్ణయ్య హాజరయి ప్రారంభించారు. సిపిఐ మండల కార్యదర్శి ఎం.నరసారావు, రైతు సంఘం మండల కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, ప్రజాసంఘాల నాయకులు రామాంజి, వీరస్వామి, వీరాంజనేయులు, ఆటో యూనియన్ నాయకులు ఉస్మాన్, రామ్, లక్ష్మణ్, బడే సాహెబ్, లక్ష్మణస్వామి, వెంకటేష్, దస్తగిరి, గోపాల్, రమేష్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేపట్టిన కార్మికులు

వైసిపి కౌన్సిలర్ల చూపు టిడిపి వైపు..?

- రంగంలోకి పార్టీ అగ్ర నాయకత్వం
- బుజ్జగించినా.. శాంతించని నేతలు

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని వైసిపి కౌన్సిలర్లు, కో ఆప్షన్స్ సభ్యుల చూపు తెలుగుదేశం పార్టీ వైపు ఉన్నది. గత మూడు నెలల కిందట నుండి క్యాంపు రాజకీయాలు నడిపిన సందర్భంలో వైసిపి పార్టీకి చెందిన అగ్రనాయకత్వం రంగ ప్రవేశం చేసి కొందరిని బుజ్జగించడం జరిగింది. అయినప్పటికీ ఆ అగ్రనాయ కత్వానికి బహిరంగంగానే కొందరు కౌన్సిల ర్లు స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడినట్లు తెలిసింది. శిల్ప చక్రపాణి రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడిన కౌన్సిలర్ కొందరు వారికి తోడుగా మరికొన్ని కౌన్సిలర్లను తయారు చేసుకొని ఈనెల 15 తేదీల్లోపు తెలుగుదేశం పార్టీలో తమ కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సిద్ధమ వుతున్నట్లు సమాచారం. ప్రధానంగా ఇప్పటికే కొందరు కౌన్సిలర్లు నేరుగా బుడ్డా రాజశేఖర్ రెడ్డితో చర్చించినట్లు తెలిసింది. తమ వార్డులలో చేరికలు ఏర్పాట్ల ను చేస్తామని ఆ కార్యక్రమానికి తప్పక రావాలని బుడ్డా రాజశేఖరరెడ్డిని కోరినట్లు ప్రచారం జరుగుతున్నది. ఏమైనాప్పటికీ ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని కౌన్సిలర్లు అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ కంటే ముందే భారీ సంఖ్యలో తెలుగుదేశం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ప్రధానంగా బీసీ మైనార్టీ ఎస్సీ కౌన్సిలర్లు చేరనున్నారని సమాచారం. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో పెద్ద స్థాయిలో ముస్లిం మైనార్టీ ఓట్లు ఉన్న నేపథ్యంలో ముస్లిం మైనార్టీ కౌన్సిలర్లు టిడిపి చేరడంతో పాటు తమ వార్డులో ఉన్న ముస్లిం మహిళలను ముస్లిం మైనార్టీలను తెలుగుదేశం పార్టీలో చేర్చే విధంగా కౌన్సిలర్లు ఇప్పటినుండి వార్డులలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు తెలుస్తున్నది. ఏమైనాప్పటికీ రాబోవు అయిదారు రోజుల్లో ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలో పెనుమార్పు వలసలు అధికార పక్షం నుండి ప్రతిపక్షం వైపు వెళ్లే విధంగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు విశ్లేషిస్తున్నారు.

అహోబిలంలో ఉగాది వేడుకలు

- పీఠాధిపతికి వీడ్కోలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పంచాంగ శ్రవణాన్ని చదువుతున్న పీఠాధిపతి

పుణ్యక్షేత్రమైన అహెూబిల క్షేత్రంలో ఉగాది వేడుకలు మంగళ వారం ఘనంగా జరిగాయి. ఎగువ, దిగువ అహెూ బిలంలో గర్భగుడిలో ఉన్న మూలవిరాట్‌కు ఉదయాన్నే నవ కలశ తిరుమంజనం నిర్వహించారు. దిగువ అహెూబిలంలో ప్రహ్లాద వరద స్వామి సన్నిధిలో అహెూబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వాముల వారు పంచాంగ పుస్తకాలను అహెూబిల నరసింహస్వామి పాదాల చెంత ఉంచి మహా మంగళ హారతి అనంతరం పంచాంగ శ్రవణాన్ని చదివి భక్తులకు విన్నపించారు.

పీఠాధిపతికి వీడ్కోలు : అహోబిల మఠం 46వ పీఠాధిపతికి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యులు, అర్చక బృందం ఘనంగా వేడుకలు పలికారు. తిరుమలలో జరిగిన అన్నమాచార్య వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన ఆదివారం అహెూబిల క్షేత్రం చేరుకున్నారు. మంగళవారం ఉదయం అహెూబిల క్షేత్రం నుండి హైదరాబాద్ అహెూబిలం మఠానికి పీఠాధిపతి స్వామి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా అర్చక బందం వీడ్కోలు పలికారు.

క్రోధీ పరాకు...

ఉగాదీ
మా తెలుగు సంవత్సరాదీ
ఏటేటా వస్తావ్ ఏ దూర తీరాల నుంచో
ఆయాసప్రయాసలకోర్చి
ఆశల రథాలు పూన్చి!
ఎండకు గొడుగు పట్టాలని కాబోలు
చెట్లకు పచ్చలందాలు తొడుగుతావ్
గ్రీష్మతపాల సేద తీర్చాలనో
మల్లెల సౌరభాలు చిమ్ముతావ్
చెమట చిరాకుల పోద్రోలాలనో ఏమో
కీరశారికల ముచ్చట్లు పెంచి
కోకిలల కుహు కుహు ధ్వానాలు పంచుతావ్
ముంజల కడియాలు
మామిడి పిందెల అందెలు తాల్చి
చిగురు రవిక తొడ్గి పచ్చ చీర కట్టి
మోదుగ పువ్వు బొట్టెట్టి
జానపద నాయికల్లే జనపదాల అడుగెట్టావ్
ఇక్కడి భాగోతాలు తట్టుకోగలవా?
ఆమధ్య అదేమో గాని
మా నాయకమణికి చెట్ల మీదే గురి
తానెక్కడ వాలితే అక్కడ వాటికి ఉరి
మనుషులకే శిరోముండనాలనుకుంటే
కొండలకూ బోడికుండ్లే
అనుచర గణాలకు అడవులు, భూములు, చెరువులు, దొరువులు,
గనులు ఇసుకపర్రలూ..
అవీ చాలకుంటే
శవాలు, మనుషుల పుర్రెలు అన్నీ సిరులే
ఈ రంగాలకు బరులే దరులే
కరువు కాటకాలొక ప్రక్క
గిట్టుబాటు కాని ధరలొక ప్రక్క
ఆకళ్ళు దాహాలు మరో ప్రక్క
ఉరులు పేనుతుంటే
వధ్య స్థలాల దొరలుతున్నాయి ఎన్నో బ్రతుకులు
ఉగాది పచ్చడి ఉనికి చెడి చేదుకు పాద్యమయ్యింది
పంచాంగం పొలమారి
నాయకుల బాకా వాద్యమయ్యింది
నిజం ఇక్కడ సంరక్షకులే సంహర్తలు!
చెట్ల హననం ఇలానే కొనసాగితే
కోయిల వాల కొమ్మైనా ఉండదు
వేప పూతకొక రెమ్మైనా మిగలదు
ఇంకెక్కడి పర్వమమ్మా సర్వం ఖర్వమయ్యింది!
రాకు తల్లీ ఇట రాకు
ఇచ్చట దుర్మార్గమే మారాకు!
విధిలేక చెబుతున్నా
క్రోధీ నీకు పరాకు!

ఎల్లరకు క్రోధి నామ ఉగాది సంవత్సర శుభాకాంక్షలతో...

ముర్తుజా షేక్.
9182494360.

ఆదమరిస్తే అంతే...?

ప్రజాశక్తి - రుద్రవరం

రహదారుల్లో ప్రయాణించేటప్పుడు గుంతలను ఆదమరిస్తే ప్రమాదాలు కొని తెచ్చుకోవడమే. మండల కేంద్రమైన రుద్రవరంలో అటవీ కార్యాలయం నుండి రజక కాలంమీదుగా బలిజపేట వరకు ఓ కాంట్రాక్టర్ గత రెండు సంవత్సరాల క్రితం డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేశాడు. అయితే ప్రధాన రహదారిలోని పలగాడి వద్ద నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలివేయడంతో అక్కడ ఉన్న గుంత పెద్ద మురికికుంటగా తయారైంది. ఈ కుంట చుట్టుపక్కల ఉన్న హెూటల్లలో నిల్వ ఉన్న మురికి నీటిని కుంటలో పడవేస్తుంటారు దీంతో కుంటలోని మురికి నీరు ముక్కు లుఅదిరేలా దుర్వాసన వెదజల్లుతుం డడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. పలుమార్లు వాహన దారులు బాటసారులు ఆదమరిచి మురిగికుంటలో పడిన సందర్భాలు అనేకం చోటుచేసుకున్నాయి. అధికారులు ప్రజా ప్రతినిధులు ఈ ప్రధాన రహదారి వెంట పలుమార్లు వెళుతూ ఉంటారని పెద్ద నుయ్యిలా ఏర్పడిన కుంటలు మాత్రం ఎవరూ పట్టించుకో వడంలేదని స్థానికులు వాపోతున్నారు. మంగళవారం సాయం త్రం తువ్వపల్లి గ్రామానికి చెందిన ఓ బాలుడు టీవీఎస్ మోటార్ సైకిల్ పై వెళ్తుండగా మురికికుంట వద్దకు చేరుకోగానే వెనక నుండి ఆటో రావడంతో సైడ్‌కి వెళ్లే ప్రయత్నంలో భాగంగా మోటార్ సైకిల్ అదుపుతప్పి మోటార్ సైకిల్‌తో సహా బాలుడు మురికి కుంటలో పడిపోయాడు. పక్కనే ఉన్న స్థానికులు ఆ బాలుడిని మోటార్ సైకిల్‌ని మురికికుంట నుండి బయటకు తీశారు. స్థానిక యువకులు బాలుడి ఒంటిపై అంటుకున్న మురికిని నీటితో శుభ్రం చేసి మానవత్వం చాటుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుంటను లేకుండా చేసి ప్రమాదాలు చోటుచేసుకున్న చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బైక్ అదుపుతప్పి మురికికుంటలో పడిన బాలుడు

నిరంతర.. విద్యుత్ దీపాలు

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్



పట్ట పగలు వెలుగుతున్న విద్యుత్ దీపాలు

నందికొట్కూరు పట్టణంలోని కొణిదెల రోడ్డులో గల జగనన్న కాలనీలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయని విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. అలాగే కొన్ని వీధులలో వెలగక ఇబ్బంది పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ దీపాలు నిరంతరం వెలుగు తున్న విద్యుత్ అధికారులు పట్టించుకోవడంలేదని కాలనీ వాసులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే రహదారులపై చిప్స్ కంకర వేసి వదిలివే యడంతో కాలనీలోకి వాహనాలు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహన దారులు జారీ ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు పక్కనే విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటుచేసి వాటికి ఎటువంటి భద్రత కంచెలు వేయక పోవడం వల్ల కాలనీవాసులు భయాందో ళనలోకు గురవుతున్నారు. కాలనీలో చాలా వరకు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి. సరైన నీటి వసతులు లేక పోవడం వల్ల నిర్మాణ పనులను ఆపేసుకునే పరిస్థితి ఏర్పడిందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని వీధులలో విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేశారు కానీ వీధి దీపాలను ఏర్పాటు చేయలేదన్నారు. కాలనీలో అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని అధికారులు ఇప్పటికైనా స్పం దించి తమ సమస్యలను పరిష్క రించాలని కాలనీ ప్రజలు కోరుకుంటున్నారు.

శ్రీశైలంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

ఉగాది బ్రహ్మోత్సవాలలో ట్రాఫిక్ క్రమబద్ధీక రించిన జిల్లా ఎస్పీ

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైలంలో జరుగు ఉగాది బ్రహ్మోత్సవాలలో జిల్లా ఎస్పీ కే.రఘువీర్ రెడ్డి ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఇందులో భాగంగా ఉగాది బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి రథ మహెూత్సవ కార్యక్రమం ముగిసిన అనంతరం ఒక్కసారిగా భక్తులు తిరుగు ప్రయాణం చేయడం వలన ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఉండేందుకు కర్ణాటక బస్టాండ్ ఏరియా, నంది సర్కిల్, ఔటర్ రింగ్ రోడ్డు, మరి ముఖ్యంగా రోడ్డు ఎగ్జిట్ పాయింట్ వద్ద గల ట్రాఫిక్ పాయింట్ల అధికారులతో మ్యానుఫ్యాక్ నందు మాట్లాడుతూ అందర్నీ అప్రమత్తం చేస్తూ నంది సర్కిల్ టోల్గేట్ వద్ద గల బయటకు వెళ్లే మార్గం వద్ద జిల్లా ఎస్పీ స్వయంగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. నంది సర్కిల్ ఎగ్జిట్ పాయింట్ వద్ద నుండి రామయ్య టర్నింగ్, సాక్షి గణపతి, అటకేశ్వరం, ముఖ ద్వారం, శిఖరం వరకు ట్రాఫిక్ పాయింట్లలోని అధికారులతో ఎప్పటికప్పుడు అప్రమ త్తం చేస్తూ వాహనాలకు ఎక్కడ అంతరాయం కలగకుండా ఉండాలని ఆదేశించారు. అనంతరం నంది సర్కిల్ ఎగ్జిట్ పాయింట్ వద్ద జిల్లా ఎస్పీ స్వయంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ డిఎస్పి, శ్రీశైలం టౌన్ ఇన్స్పెక్టర్ జి.ప్రసాదరావు, ఇన్స్పెక్టర్‌లు రవీంద్ర, దస్తగిరి బాబు, రిజర్వు సబ్ ఇన్స్పెక్టర్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

దోమలు బాబోయ్... దోమలు..

- నామమాత్రంగా పారిశుధ్య పనులు, ఫాగింగ్

ప్రజాశక్తి - బనగానపల్లె

పారిశుధ్య లోపం కారణంగా దోమలు రోజు రోజుకు వృద్ధి చెందుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు స్వైర విహారం చేస్తూ ప్రజలను కుడుతూ రోగలబారిన పడేలా చేస్తున్నాయి. ప్రజలు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా దోమ కాటు నుండి తప్పించుకోలేకపోతున్నారు. అధికారులు దోమల నివారణకు ఫాగింగ్, పారిశుధ్యం తొలగించేందుకు నామమాత్రంగానే చర్యలు తీసుకుంటుండడంతో దోమలను పూర్తి స్థాయిలో అరికట్ట లేకపోతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బనగానపల్లె పట్టణంలోని కొండపేట, తెలుగు పేట, బిసి రాజారెడ్డి కాలనీ, పెండేకంటి నగర్, రంగరాజుపేట తదితర కాలనీలలో మురికి కాల్వలను శుభ్రం చేయకపోవడంతో కాలువల్లో నీరు నిలిచి దోమల బెడద అధికమైందని ప్రజలు వాపోతున్నారు. ఉదయం, రాత్రి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నా అధికారులకు పట్టడం లేదు. పట్టణంలో ఫాగింగ్ అంతంత మాత్రంగానే చేస్తున్నారు.

మురుగు కాలువలో నిల్వ ఉన్న నీరు

ప్రజలు నానా అవస్థలు పడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవ డం లేదని ప్రజలు మండిపడు తున్నారు. దోమ కాట్లతో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ లాంటి జబ్బుల బారిన పడితే దిక్కెవరిని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. దోమల భయానికి ప్రజలు సాయంత్రం 5 గంటలకే తలుపులు వేసేసుకుంటున్న పరిస్థితి ఉంది. నివాసంలో దోమల నియంత్రణకు ఆల్ అవుట్, గుడ్‌నైట్ తదితర వాటిని ఎన్ని వాడుతున్నా ఫలితాలు కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని బనగానపల్లె పట్టణ ప్రజలు కోరుతున్నారు.

శ్రీమఠంలో ఉగాది విశేష పూజలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో ఉగాది వేడుక, పూజలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెలుగు సంవత్సరాది ఉగాది పండగ సందర్భంగా పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు శ్రీమఠంలోని రాఘవేంద్రస్వామి మూల బృందావనం, వాధీంద్ర తీర్థుల బృందావనంతో పాటు ఇతర గురువుల బృందావనాలకు తైల అభ్యంగనం చేసి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం బృందావనాలను నిర్మాల్యం చేశారు. తర్వాత పీఠాధిపతులకు కూడా వారి పూర్వాశ్రమ మాతృమూర్తి మంజులమ్మ తైల అభ్యంగనం చేసి మంగళ హారతులు ఇచ్చారు. తైల అభ్యంగన స్నానం చేసిన పీఠాధిపతులకు ఆయన పూర్వాశ్రమ కుమారుడు రాజా ఎస్.అప్రమేయాచార్ నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు గోపూజ, తులసి పూజ వంటి విశేష పూజలు చేశారు. రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకుని నైవేద్య సమర్పణతో మంగళ హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు మాట్లాడారు. స్థానిక శ్రీమఠంలో ఆయన దేశంలోనే కాక ఇతర దేశాల్లో ఉన్న హిందువులందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు సంవత్సరాది ఉగాది నుంచి మనకు నూతన సంవత్సరం మొదలవుతుందని చెప్పారు. పండితులు రచించిన పంచాంగాలను అనుసరించి హిందువులు నడుచుకోవడం సాంప్రదాయమన్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండి పాడి పంటలతో రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

తైల అభ్యంగనం చేస్తున్న మహిళలు

ప్రదీప్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ప్రదీప్ రెడ్డికి జైభీమ్ ఎంఆర్‌పిఎస్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - మంత్రాలయం

వైసిపి రాష్ట్ర యువజన విభాగం నాయకులు, సింగిల్ విండో అధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డికి జైభీమ్ ఎంఆర్‌పిఎస్ నాయకులు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఎమ్మిగనూరులోని భీమా నిలయంలో జైభీమ్ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ ఆధ్వర్యంలో ప్రదీప్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కార్యదర్శి చిలకలడోన మాదిగ రత్నం, జిల్లా అధ్యక్షులు ప్రశాంత్, మండల అధ్యక్షుడు సూగూరు హనుమంతప్ప, బుజ్జి ఉన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మంత్రాలయం

తెలుగు సంవత్సరాది ఉగాది ప్రజలకు సుఖ సంతోషాలు ఇవ్వాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం ఉగాది పండగ సందర్భంగా ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల తరపున ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది అయినా వర్షాలు సకాలంలో కురిసి పంటలు సమృద్ధిగా పండి రైతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీలు, అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షించారు.

అంబేద్కర్ జయంత్యుత్సవ సభను జయప్రదం చేయడం

- కమిటీ కన్వీనర్ దేవసహాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు/నందవరం

ఈనెల 14న ఎమ్మిగనూరు పట్టణంలోని పద్మశ్రీ మాచాని సోమప్ప మెమోరియల్ హాలులో నిర్వహించే డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంత్యుత్సవ సభకు దళితులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంత్యుత్సవ కమిటీ కన్వీనర్ ఎస్.దేవసహాయం, సభ్యులు జి.ఆనంద్ చైతన్య మాదిగ కోరారు. మంగళవారం నందవరం మండలం ఇబ్రహీంపురం, నది కైరవాడి, గంగవరం, పెద్ద కొత్తిలి, చిన్న కొత్తిలి, నాగలదిన్నె, మాచాపురం, నందవరం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. దళితుల ఐక్యతను ప్రదర్శిస్తూ ఎమ్మిగనూరు పట్టణంలోని కలుగొట్ల రోడ్డు ఎంబి.చర్చి దగ్గర ఆది ఆంధ్ర పాఠశాల నుంచి సభా స్థలం వరకు భారీ ప్రదర్శన, ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కనకవీడు రాజు, కనకవీడు మాల పూజారి, నాగప్ప, ఇబ్రహీంపురం సక్రప్ప, నది కైరవాడి ఈరన్న, ఆనందరాజు, దేవదాసు, జానయ్య, గంగవరం టి.శాంతి రాజు, సేతు, రాముడు, భీమన్న ఉన్నారు.

నందవరం మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

అగ్నిప్రమాదంలో ఐదు గడ్డివాములు దగ్ధం

దగ్ధమవుతున్న గడ్డివాములు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

గ్రామ శివారుల్లోని బనవాసి రహదారి సమీపంలో వంక వద్ద మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఐదు గడ్డివాములు దగ్ధమయ్యాయి. రూ.లక్ష వరకు ఆస్తి నష్టం సంభవించింది. వంక సమీపంలో రైతులు దుర్గన్నగారి మేషేక్, డేవిడ్, కుమ్మరి హనుమంతు వరి గడ్డివాములు వేసుకున్నారు. మధ్యాహ్నం గడ్డివాములకు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మంటల్లో మేషేక్, కుమ్మరి హనుమంతుకు చెందిన రెండు చొప్పున, డేవిడ్‌కు చెందిన ఒకటి మొత్తం ఐదు గడ్డివాములు అగ్నికి ఆహుతి అయ్యాయి. చుట్టుపక్కల వారు అప్రమత్తమై మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేసినా నీటి వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ఆదోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చినా అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోగా గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. మూగజీవుల కోసం వేలాది రూపాయలతో కొనుగోలు చేసి ఏర్పాటు చేసుకొన్న గడ్డివాములు అగ్నిప్రమాదంలో దగ్ధం కావడంతో బాధిత రైతులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా శ్రీదేవరహాల్ అయ్యమ్మ జాతర

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో వెలసిన శ్రీదేవరహాల్ అయ్యమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం పిండి వంటకాలతో నైవేద్యం సమర్పించిన భక్తులు సాయంత్రం జాతర ఉత్సవాలు నిర్వహించారు. ఉగాది సందర్భంగా ఉదయం ఎద్దుల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. రాత్రి కన్నడ సామాజిక నాటక కార్యక్రమం నిర్వహించారు.

రథోత్సవం లాగుతున్న గ్రామస్తులు

పెద్దహోతూరులో సమస్యలు వింటున్న షేక్ షా వలీ

పాలకుల దోపిడీతోనే వెనుకబాటు

- జెబిపి అభ్యర్థి షేక్ షా వలీ

ప్రజాశక్తి- ఆలూరు

ఎన్నికల్లో కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి గెలిచిన అభ్యర్థులు దోపిడీ చేసి సంపాదించి అభివృద్ధిని గాలికి వదిలేస్తారని జై భారత్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రొఫెసర్ షేక్ షా వలీ తెలిపారు. మంగళవారం నియోజకవర్గంలోని పెద్దహోతూరు, చిన్నహోతూరు, జొహరాపురంలో ప్రజా సమస్యలు వింటూ ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లకోసారి తమ జీవితాల మార్పు కోసం ఎన్నుకునే ముందు ప్రజల కోసం పనిచేసే వారికి ఓటు వేయాలని కోరారు. టార్చి లైట్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని తెలిపారు. నియోజకవర్గంలో సాగు, తాగునీటి కోసం వేదవతి, నగరడోన రిజర్వాయర్ నిర్మాణం పూర్తిచేసి ప్రతి ఇంటికీ తాగునీరు అందజేస్తామన్నారు.

ఘనంగా ఉగాది ఉత్సవాలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని వివిధ గ్రామాలతో పాటు గోనెగండ్లలో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే వీరశైవ పీఠాధిపతి శివయ్య స్వామి పంచాంగ శ్రవణం గావించి శ్రీక్రోధినామ సంవత్సరం సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం సంత మార్కెట్ ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారి వరకు ప్రభను అలంకరించి ప్రజలందరూ కలిసి లాగుతూ ఊరేగించారు. ప్రధాన రహదారి వద్ద నిర్వహించిన నందికోళ్ల ఆట ప్రజలకు కనువిందు చేసింది.

ప్రభను ఊరేగిస్తున్న ప్రజలు

మతిస్థిమితం లేని మహిళపై అత్యాచారయత్నం

ప్రజాశక్తి - ఆస్పరి

మతిస్థిమితం లేని మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడిన నగరూరు గ్రామానికి చెందిన ముత్తుకూరు రాముడును అరెస్టు చేసినట్లు సిఐ హనుమంతప్ప తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. బిణిగేరి గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మహిళను ముత్తుకూరు రాముడు నగరూరు క్రాస్‌లోని బస్టాండ్‌లో ఆదివారం రాత్రి అత్యాచార యత్నానికి పాల్పడినట్లు తెలిపారు. బిణిగేరి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు వెళ్లే సరికి రాముడు అక్కడి నుంచి పారిపోయాడని చెప్పారు. సోమవారం బాధితురాలు అన్న గొల్ల లక్ష్మన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. సిబ్బందితో వెళ్లి నిందితుని ఆస్పరిలోని అంబేద్కర్ సర్కిల్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

నిందితుని రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

టిడిపిలో చేరిన వారు వైసిపికి చెందిన వారు కాదు

- వైసిపి మండల నాయకులు ఏకంరెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని ఉపరహాలు గ్రామానికి చెందిన కొంతమంది కార్యకర్తలు టిడిపిలో చేరినట్లు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి, సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, సురేష్ నాయుడు వైసిపి నుంచి చేరినట్లు ప్రకటించడం తగదని వైసిపి మండల నాయకులు ఏకం రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తన స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపిలో చేరిన వారు ఎప్పటి నుంచో టిడిపిలో ఉన్నారని తెలిపారు. టిడిపిలో ఉన్న వారికి టిడిపి కండువా వేసి వైసిపికి చెందిన వారు అని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చేరిన వారిలో ఒకే ఒక వ్యక్తి వైసిపి కార్యకర్త అని, అతను కూడా సాధారణంగా గ్రామస్తులతో కలిసి వెళ్లారని తెలిపారు. పార్టీలో చేరుతున్నట్లు ఆ వ్యక్తికే తెలియదని పేర్కొన్నారు. వైసిపిపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం టిడిపి నాయకుల విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. పార్టీలో చేర్చుకునే ముందు, వారు ఏ పార్టీకి చెందిన వారో తెలుసుకొని చేర్చుకుంటే బాగుంటుందని హితవు పలికారు. గ్రామంలో అభివృద్ధి జరగలేదని టిడిపి నాయకులు పేర్కొనడం తగదన్నారు. గ్రామంలో సుమారు రూ.4 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. అభివృద్ధిపై చర్చకు సిద్ధమని చెప్పారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి గ్రామాల వైపు రావడం లేదని చెప్పడం తప్పు అన్నారు. గ్రామంలో అభివృద్ధి పనుల కోసం ఎన్నోసార్లు వచ్చారని తెలిపారు. వైసిపి నాయకులు చిన్న మహాదేవ, పెద్ద లింగన్న, విజయ్ కుమార్, రామ గోవిందప్ప, చెన్న కేశవరెడ్డి, గంగేష్, మహాదేవ, దస్తగిరి, పరమేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏకంరెడ్డి

ఘనంగా ఫెర్రర్ జన్మదిన వేడుకలు

నివాళులర్పించిన పేదలు

ప్రజాశక్తి తుగ్గలి

మండలం పరిధిలోని ఎల్లమ్మ గుట్టతండా, రోల్లపాడు, రోల్లపాడుతండా , జొన్నగిరి, పగిడిరాయి తదితర గ్రామాలలో మంగళ వారం రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డిటి) వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 104 జయంతి ఉత్స వాలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు భీమా నాయక్, బాబు నాయక్, లూలా నాయక్, అశోక్ నాయక్ రాము నాయక్ ,ఎస్సీ నాయకులు రోల్లపాడు వెంకటేశు, పగిడిరాయి దేవేంద్ర, పగిడిరాయి రామంజి తదితరులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ స్పెయిన్ దేశం నుంచి కరువు సీమలో అడుగుపెట్టిన ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ పేదల బతుకులు చూసి చలించిపోయారన్నారు. వారి జీవితాల్లో మార్పు తీసుకురావలంటే చదువే సరైన మార్గమని భావించి రూరల్ డవలప్మెంట్ ట్రస్ట్ స్థాపించి విద్యా ,వైద్యం, ఆరోగ్యం. రంగాలకు ప్రాధాన్యత ఇచ్చి పేదల కుటుంబల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. తెలుగు రాష్ట్రాలలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ను ఆదర్శంగా తీసుకొని అనేక మంది యువకులు స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసుకొని పేదలకు సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు.

బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న గౌరు వెంకటరెడ్డి

విద్యుద్ఘాతంతో విలువైన ఆస్తి నష్టం

బాధిత కుటుంబాలను పరామర్శించిన గౌరు వెంకటరెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

విద్యుత్ షాక్ సర్క్యూట్‌తో కల్లూరు అర్బన్ 27 వార్డు అబ్బాస్ నగర్ రవీంద్ర స్కూల్ దగ్గర కిరాణం షాప్ , ఓ ఇంట్లో విలువైన ఎలక్ట్రికల్ పరికరాలు, బంగారు ఆభరణాలు కాలిపోయాయి. సుమారు రూ.మూడు లక్షల విలువైన ఆస్థికి నష్టం జరిగింది. మంగళవారం టిడిపి సీనియర్ నాయకులు నందికొట్కూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి గౌరు వెంకటరెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, కేతురు మధు తదితరులు పాల్గొన్నారు.

సి బెళగల్‌లో టిడిపి ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దస్తగిరి

టిడిపి ఎన్నికల కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-సి బెళగల్

సి.బెళగల్ మండల కేంద్రంలో కోడుమూరు టిడిపి అభ్యర్థి పసుపుల దస్తగిరి మంగళవారం టిడిపి మండల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇందుకు నాయకులు ఈరన్న గౌడ్, చిన్న తిమ్మప్ప, పోలకల్ అమర్, సోముగౌడ్, వెంకట్రామిరెడ్డి, సర్పంచి రామాంజనేయులు, సూరి, మల్లికార్జున గౌడ్, ధనుంజయ, కొత్తకోటమధు తదితరులు పాల్గొన్నారు. టిడిపి గెలుపునకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని, కార్యాలయంలో ప్రతి సమస్యను చర్చించుకొని సమన్వయముతో ముందుకెళ్లాలని దస్తగిరి పేర్కొన్నారు.

స్వేచ్ఛగా , నిర్భయంగా ఓటేయండి

కర్నూలు జిల్లా ఎస్‌పి కృష్ణకాంత్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాలలో పోలీసులు కవాతు నిర్వహించారని కర్నూలు జిల్లా ఎస్‌పి జి. కృష్ణకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లా పోలీసులు ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తున్నామన్నారు. ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతిభద్రతలను కాపాడడానికి కేంద్ర సాయుధ బలగాల పోలీసులతో కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని జిల్లా ప్రజలకు జిల్లా ఎస్‌పి విజ్ఞప్తి చేశారు. ఎన్నికలలో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా దానికి జిల్లా పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. ఎస్‌పి ఆదేశాల మేరకు జిల్లాలోని కర్నూలు, పత్తికొండ, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లలోని పలు ప్రాంతాలలో కేంద్ర సాయిధ బలగాలైన 'సశస్త్ర సీమా బల్' సిబ్బందితో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. కర్నూలు రెండవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని కొత్తపేట, 5 రోడ్డ్ జంక్షన్, ఎస్‌బిఐ సర్కిల్, గాంధీనగర్, నరసింహారెడ్డి, లేబర్ కాలనీ, భగత్ సింగ్ , వెంకటరమణ కాలనీలలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. కర్నూలు రెండవ పట్టణ సిఐ ఇంథియాజ్‌బాషా పాల్గొన్నారు. దేవనకొండ యుపిఎస్ పోలీసుస్టేషన్ పరిధిలోని నల్లచెలమల, కుడిమిరాళ్ల, బంటుపల్లి, బేతంపల్లి, మాండపల్లె

గ్రామాలలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. దేవనకొండ యుపిఎస్ సిఐ శ్రీనివాసులు పాల్గొన్నారు. గోనెగండ్ల పోలీసుస్టేషన్ పరిధిలోని ఎం. అగ్రహారం, బైలుప్పల , గంజహళ్ళి గ్రామాలలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎస్ఎస్‌బి అసిస్టెంట్ కమాండెంట్ రాకేష్,గోనెగండ్ల సిఐ రామకృష్ణయ్య పాల్గొన్నారు.

చౌడేశ్వరి దేవి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె మండలం నందవరం చౌడేశ్వరి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చౌడేశ్వరిదేవి దేవస్థానంలో ఉగాది పండగ రోజు నుంచి అమ్మవారికి 8 రోజులు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. గణపతిపూజ, పుణ్యాహవాచన, అంకురార్పణ, పంచాగ శ్రవణం, సాయంత్రం పన్నేరపు బండ్లు తిప్పుట, ప్రాకార రథోత్సవం దేవస్థానంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి జి కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో జరిగాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి

వచ్చారు. సాయంత్రం ఆలయం చుట్టూ గ్రామస్తులు పన్నేరపుబండ్లు తిప్పారు.

ఘనంగా ఉగాది ఉత్సవాలు

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి, రాతన, జొన్నగిరి, పెండేకల్లు, శభాష్‌పురము, ఎర్రగుడి తదితర గ్రామాలతో పాటు వివిధ గ్రామాలలో ఉగాది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గ్రామాలలో ఉన్న దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని తుగ్గలిలో శ్రీరామ దేవాలయం, ఈశ్వర ఆలయంలో పండితులు పంచాంగం శ్రవణం చేశారు.

సత్యనారాయణమ్మను సన్మానించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షురాలుగా నూతనంగా ఎన్నికైన సిట్రా సత్యనారాయణమ్మ, గడ్డం రామకృష్ణ దంపతులను మంగళవారం కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హాఫీస్‌ఖాన్ తన నివాసంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి పాటుపడాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. వైసిపి అభ్యర్థులను గెలిపించాలని అన్నారు.

కెవి సుబ్బారెడ్డి కళాశాలలలో ఉన్నతి 2కె 24 వేడుకలు

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగర శివారు దూపాడులోని కెవిఎస్‌బి, కెవిఎస్‌ఎం డాక్టర్ కె వి సుబ్బారెడ్డి ఎంబిఎ, ఎంసిఎ కళాశాలలో ఉన్నతి 2 కె 24 రెండు రోజుల మెగా నేషనల్ లెవల్ మేనేజ్ మెంట్ , టెక్నికల్ ఫెస్ట్ ఆరంభం, ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయని కళాశాలల ఛైర్మన్ కె. విశ్వమోహన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి మొదటి రోజు ముఖ్య అతిథిగా కళాశాలల వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కెవి సుబ్బారెడ్డి హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇలాంటి నేషనల్లెవల్ ఫెస్ట్‌లో విద్యార్థులు తమ ప్రజ్ఞ పాఠవాలను ప్రదర్శించే అవకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇలాంటి కార్యక్రమాలను రానున్న రోజులలో మరిన్ని ఎక్కువ సంఖ్యలో నిర్వహించే కార్యచరణ రూపొందించామని, కళాశాల ఛైర్మన్ కె. విశ్వమోహన్ రెడ్డి తెలిపారు. తెలుగు రాష్ట్రాలు మాత్రమే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలోని 24 కళాశాలల నుంచి ఎంబిఎ, ఎంసిఎ, బిబిఎ, బిసిఎ, బి కామ్, బిబిఎం, బి టెక్, బి ఫారం, బిఎస్‌సి యుజి, నాన్ పిజి విద్యార్థులు, ఆ కళాశాలల అధ్యాపక బృందాలు' పాల్గొన్నాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఒ.రవిశంకర్ తెలిపారు. ఫార్మల్ ఈవెంట్స్ అయిన హెచ్‌ఆర్, ఫైనాన్స్ మార్కెటింగ్, టెక్నికల్, పేపర్ ప్రజెంటేషన్, విఒఎఎస్ డబ్ల్యూ, ఇన్ఫార్మల్ ఈవెంట్స్ మిస్టర్ మిస్సెస్ ఉన్నతి 2కె24 మిస్టర్ మిస్సెస్ సెల్ఫీ, డాన్స్ మానియా, బైక్ రేస్, వి రౌండ్ వన్ రౌండ్ 2 రౌండ్-3 లలో వారి ప్రతిభను కనబరిచినారు. .రెండవ రోజు ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా రాయలసీమ విశ్వవిద్యాలయం రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టికు నాయక్ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఇలాంటి వేదికలను నేటితరం విద్యార్థులు ఉపయోగించుకొని తమలోని ప్రతిభ, మేధాశక్తి, నూతన ఆవిష్కరణల దిశగా

విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు అందజేస్తున్న అతిథులు

ముందుకు సాగాలని సూచించారు. ఉన్నతి -2కె 24 కార్యక్రమ ప్రాయోజకులైన శౌర్యహోండా సిక్యాంప్, ఆంప్లిలాన్ సోలార్, అర్క హాస్పిటల్, హోటల్ ఇంటర్నేషనల్ ,ఫుడ్ వరల్డ్,జూమ్ స్టూడియో, రెడ్ ఫిట్నెస్ క్లబ్, క్లినిక్స్, కర్నూలు వారిని కూడా కళాశాలల ఛైర్మన్ కె.విశ్వమోహన్ రెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ డాక్టర్ ఒ. రవిశంకర్, డాక్టర్ హెచ్.అంజనప్ప, ప్రోగామ్ కన్వీనర్స్ డాక్టర్ కె. రామాంజనేయులు, ఆర్.సర్వేశ్వరరెడ్డి, కో కన్వీనర్ ఆర్ రవి, ఎ.సుమన్ కళ్యాణ్, అధ్యాపక , అధ్యాపకేతర బృందం, వివిధ ఎంబిఎ, ఎంసిఎ, యుజి, పిజి కళాశాలల విద్యార్థులు, సంబంధిత అధ్యాపక బృందాలు పాల్గొన్నాయి.